కార్తిక మాసం.. పరమ పవిత్రం!

- భక్తిశ్రద్ధలతో పూజలు చేసిన భక్తులు
- భక్తులతో కిటకిటలాడిన శైవ క్షేత్రాలు


సత్తెనపల్లి శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


నార్నెపాడు ఆలయంలో భీమేశ్వరస్వామి

సత్తెనపల్లి: కార్తిక మాసం ఆఖరి సోమవారం పలు ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామునే భక్తులు అధిక సంఖ్యలో శైవ క్షేత్రాలకు చేరుకొని అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మహిళలు కార్తిక దీపాలు వెలిగించి కుంకుమ పూజలు చేశారు. పట్టణంలోని అచ్చంపేట రోడ్డులోని దుర్గా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం, గుంటూరు రోడ్డులోని శ్రీ సనారి వీర బ్రహ్మేంద్ర ఆశ్రమం, పెద్దమక్కెన గ్రామంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో పూజలకు భక్తులు పోటెత్తారు. ఆలయాల్లో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులకు ఆటంకం కలగకుండా ఆయా ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

కార్తిక సోమవారం ప్రత్యేక పూజలు

ముప్పాళ్ళ: మండలంలోని పలు ఆలయాల్లో కార్తిక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పాల్గొని పూజలు చేశారు. నార్నెపాడులోని భీమేశ్వరస్వామి ఆలయం, ముప్పాళ్లలోని కాశీ అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, చాగంటివారి పాలెంలోని జగన్నాథస్వామి ఆలయం, మాదలలోని సంగమేశ్వరస్వామి ఆలయంకలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వైభవంగా కార్తిక సోమవారం పూజలు

బెల్లంకొండ: కార్తిక మాసం చివరి సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. బెల్లంకొండ, పాపాయపాలెం, చంద్రాజుపాలెం, కందిపాడు, గంగిరెడ్డిపాలెం, వెంకటాయపాలెం గ్రామాల్లోని ఆలయాలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. ఉదయాన్నే భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి, శివాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. కార్తిక దీపాలను వెలిగించి భక్తి చాటుకున్నారు. బెల్లంకొండలో లక్ష్మీ తిరుపత్మ, గంగమ్మ, పోలేరమ్మ తల్లి ఆలయాల వద్ద భక్తులు కార్తిక దీపాలను వెలిగించారు.


శివాలయంలో క్యూలైన్‌లో భక్తులు


బెల్లంకొండలో కార్తిక దీపాలను వెలిగిస్తున్న మహిళలు

క్లుప్తంగా

సైడు డ్రైయిన్స్ నిర్మించండి



అచ్చంపేట: స్థానిక అచ్చమ్మ పేరంటాళమ్మ తల్లి వీధిలో కొందరి ఇళ్ల వద్దనే లోతైన కాలువలు తీసి వదిలేస్తున్నారని, వెంటనే సిమెంట్ సైడ్ డ్రైన్స్ నిర్మించాలని సోమవారం తహసీల్దారు కార్యాలయంలో జరిగిన సమస్యల పరిష్కార వేదికలో స్థానికులు ఫిర్యాదు చేశారు. చివర, మొదలు వదిలిపెట్టి మధ్య ఇళ్ల వద్ద పెద్ద కాలువలు తీయడం, తీసిన కాలువలను మూడు నెలలుగా పూడ్చకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామన్నామని పేర్కొన్నారు. ప్రశ్నిస్తే ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్నారంటూ నోటీసులు ఇచ్చారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో కొమరాల రమేష్, మట్టుపల్లి సునీత, షేక్ రఫీ, నిమ్మా వెంకటేష్ ఉన్నారు.

యోగాలో విద్యార్థుల ప్రతిభ



అచ్చంపేట: నర్సరావుపేటలోని ఎస్ఈసీ ఇంజినీరింగ్ కళాశాలలో డాక్టర్ విజయ నిర్మల మెమోరియల్ సౌత్ ఇండియా మార్షల్ ఆర్ట్ ఛాంపియన్ షిప్ యోగాసనాల పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరచి పతకాలు సాధించినట్లు హెచ్ఎం సీహెచ్ కల్యాణి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరచిన విద్యార్థులను పీడీ సుజాత, హెచ్ఎం కల్యాణి, ఉపాధ్యాయులు అభినందించారు. 14 సంవత్సరాల బాలికల విభాగంలో కె.నాగ వినీత, ఒ.బ్లెస్సీ, ఆర్.దీప్తి, డి.నిస్సి, కె.స్వరూపారాణి, బాలుర విభాగంలో డి.అజయ్‌కుమార్, షేక్ సమ్మద్‌బాజి పథకాలు సాధించినట్లు పీడీ ఆలపాటి సుజాత తెలిపారు.

విద్యార్థినికి ల్యాప్ టాప్ వితరణ



అచ్చంపేట: నిరుపేద ఇంజినీరింగ్ విద్యార్థిని నడుకుదురి తేజస్వినికి మాగులూరి ఫౌండేషన్ ప్రతినిధులు సోమవారం రూ.40 వేలు విలువ చేసే ల్యాప్‌టాప్‌ను వితరణ చేశారు. కోనూరు గ్రామానికి చెందిన నడుకుదిరి తేజస్విని విశాఖపట్నం ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రీ సీటు సాధించి, బీటెక్ నాల్గవ సంవత్సరం చదువుతోంది. ప్రాజెక్టు వర్క్ నిమిత్తం మాగులూరి ఫౌండేషన్ ఫౌండర్ మాగులూరి భాను ప్రకాష్ విద్యార్థినికి ల్యాప్‌టాప్ పంపారు. సంస్థ ప్రతినిధులు మాగులూరి కృష్ణారావు, కుంచనపల్లి కిరణ్, కొండవీటి ప్రసాద్, వేగుంట రాణి తదితరులు విద్యార్థిని కుటుంబ సభ్యులకు దానిని అందజేశారు.

హోసన్నా దేవుని దయా క్షేత్రం ప్రారంభం



అమరావతి: మండల పరిధిలోని 14వ మైలు సెంటర్‌లో ప్రానరంభమైన హోసన్నా మినిస్ట్రీస్ దేశ, విదేశాల్లో శాఖోపశాఖలుగా విస్తరించిందని హోసన్నా మినిస్ట్రీస్ ప్రతినిధి పాస్టర్ అబ్రహాం అన్నారు. సోమవారం ఎండ్రాయి గ్రామ పరిధిలో ఏర్పాటు చేసిన హోసన్నా దేవుని దయా క్షేత్రం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ అబ్రహాం మాట్లాడుతూ గోరంట్ల హోసన్నా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే గుడారాల పండగకు దేశ వి దేశాల నుంకి భక్తులు లక్షల్లో విచ్చేస్తారని తెలిపారు. అక్కడ స్థలం సరిపోక పోవడంతో దేవుని కృపతో ఎండ్రాయి గ్రామ పరిధిలో సుమారు 10 ఎకరాల భూమిని హోసన్నా మినిస్ట్రీస్ కొనుగోలు చేసిందన్నారు. ఈ ఏడాది గుడారాల పండుగ ఈ స్థలంలో నిర్వహించాలని సంకల్పించామన్నారు. ఈ సందర్భంగా పాస్టర్లు జాన్‌వెస్లీ, రమేష్, ఫ్రెడిపల్, రాజు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం హోసన్నా దేవుని దయా క్షేత్రం శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన సుమారు 5వేల మందికిపైగా భక్తులు పాల్గొన్నారు.

11 మంది జూదరుల అరెస్ట్

రెంటచింతల: గ్రామాలలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సీహెచ్ నాగార్జున హెచ్చరించారు. సోమవారం ఎస్ఐ మాట్లాడుతూ మండలంలోని రెంటాల గ్రామంలో ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.72,300 స్వాధీనం చేసుకున్నట్లు తెలి పారు. మీ ప్రాంతంలో అసాంఘిక చర్యలు జరగకుండా ఉండాలంటే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎవరైనా గ్రామం విడిచి వెళ్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

వంద శాతం హాజరు ఉండేలా చర్యలు


– జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ


బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న డీఈఓ చంద్రకళ

సత్తెనపల్లి: జిల్లాలోని ప్రతి పాఠశాలలో విద్యార్థుల హాజరు వంద శాతం ఉండేలా చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ అన్నారు. సత్తెనపల్లి లోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కువ కాలం గైర్హాజరైన వారిని నియంత్రించేందుకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. 6, 8, 10వ తరగతి విద్యార్థులు పాఠాలు నేర్చుకుంటున్న తీరును గమనించారు. స్లో లెర్నర్‌లకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, వారి చేతి రాత నైపుణ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. తరగతిగది వాతావరణం, భవనాల పరిస్థితులు, నిరుపయోగంగా ఉన్న తరగతి గదులను, మనబడి మన భవిష్యత్తు పనులను సందర్శించి సిమ్స్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బోజన పథకాన్ని పరిశీలించారు. ప్రమాణాలను మెరుగు పరచడానికి ప్రధానోపాధ్యాయురాలు మాధవీలత, వంట సిబ్బందికి సూచనలు జారీ చేశారు. అపార్ డేటా పూర్తి చేసి విద్యాశాఖలో కొత్త సంస్కరణలపై మరింత దృష్టి కేంద్రీకరించడం, రికార్డులను నిర్వహించేందుకు సూచనలు చేశారు. అనంతరం క్షేత్రస్థాయిలో భాగంగా పట్టణంలోని నాగన్నకుంటలో బడిబయట ఉన్న పిలల్ల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, నలుగురిని తిరిగి పాఠశాలలో చేరే విధంగా అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాలల్లో డిప్యూటీ డీఈఓ ఏసుబాబు, మండల విద్యాశాఖాధికారి ఎ.శ్రీనివాసరావు, బాలికోన్నత పాఠశాల హెచ్ఎం మాధవిలత, కేజీబీవీ ఎస్ఓ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లతో.. రూ.18 వేల కోట్ల వసూళ్లకు కుట్ర

సీపీఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు గద్దె చలమయ్య


అవగాహన కల్పిస్తున్న గద్దె చలమయ్య

సత్తెనపల్లి: గత ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లు బిగించవద్దని, ఏర్పాటు చేసిన మీటర్లను పగలగొట్టాలని చెప్పిన సీఎం చంద్రబాబు నాయుడు.. అధికారంలోకి వచ్చి ఏకంగా రూ.18 వేల కోట్లు విద్యుత్ చార్జీలు పెంచి ఆ పెంచిన బిల్లుల మొత్తాన్ని వసూలు చేసేందుకు కుట్ర చేస్తున్నారని సీపీఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు గద్దె చలమయ్య విమర్శించారు. సత్తెనపల్లిలో గత వారం నుంచి ఆదాని కంపెనీ సిబ్బంది 500కు పైగా విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించారు. సోమవారం పట్టణంలోని ఎన్ఆర్ కాంప్లెక్స్‌లో స్మార్ట్ మీటర్లు బిగిస్తుండగా దుస్తుల షాపు యజమాని అవ్వారు సర్వేశ్వరరావు దీనిని అడ్డుకున్నారు. సీపీఎం శ్రేణులకు సమాచారం ఇవ్వగా గద్దె చలమయ్య, పట్టణ కార్యదర్శి ధరణికోట విమల బృందం అక్కడకు చేరుకున్నారు. తక్షణమే ఈ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం వేసిన విద్యుత్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జరిగే ఉద్యమాలలో ప్రజానీకమంతా భాగస్వాములు కావాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పెండ్యాల మహేష్, నాయకులు జడ రాజకుమార్, ఎ.వెంకటనారాయణ, అవ్వారు ప్రసాదరావు, షేక్. సైదులు, దామర్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వెలుగులో ఆర్థిక అవకతవకలపై విచారణ



అమరావతి: మండల పరిధిలోని ధరణికోట గ్రామంలో వివిధ పథకాల ద్వారా డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలలో ఆర్థిక అవకతవకలపై స్త్రీనిధి విచారణ కమిటీ సోమవారం రాత్రి విచారణ చేపట్టింది. డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్ ఆదేశాల మేరకు దరణికోట తూర్పువీధి రామాలయంలో అర్థిక అవవతవకల జరిగిన గ్రూపుల బాధ్యులను పిలిపించి, విచారణ చేపట్టారు. ఈ విచారణలో సేకరించిన సమాచారాన్ని నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందజేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. యానిమేటర్లు, గ్రూపు లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.

97 ఖాళీల భర్తీకి నోటిఫికేషన్

సత్తెనపల్లి: సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని చౌక ధరల దుకాణాల్లో ఏర్పడిన 97 ఖాళీలను శాశ్వత ప్రాతిపదికన నియామకం చేపట్టేందుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు సత్తెనపల్లి ఇన్‌చార్జి ఆర్డీవో కె.మధులత సోమవారం తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో డిసెంబర్ 4న సాయంత్రం 5 గంటల లోపు అందజేయాలన్నారు. రాత పరీక్ష డిసెంబర్ 9న ఉంటుందని, మౌఖిక పరీక్ష డిసెంబర్ 11న ఉంటుందన్నారు. 16న నియామక పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్‌లోని అమరావతి మండలంలో 8, అచ్చంపేట మండలంలో 11, బెల్లంకొండ మండలంలో 13, క్రోసూరు మండలంలో 14, ముప్పాళ్ళ మండలంలో 5, నకరికల్లు మండలంలో 16, పెదకూరపాడు మండలంలో 9, రాజుపాలెం మండలంలో 9, సత్తెనపల్లి మండలంలో 12 చౌకధరల దుకాణాలకు నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. పూర్తి వివరాలకు ఆయా మండల తహసీల్దార్ల కార్యాలయంలో, రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో పని వేళల్లో సంప్రదించాలన్నారు.

ఆర్యవైశ్య యువజన సంఘం సెక్రటరీగా రామకృష్ణ


మంత్రి టీజీ భరత్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న రామకృష్ణ

సత్తెనపల్లి: ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి సత్తెనపల్లి కి చెందిన డాక్టర్ కొత్త రామకృష్ణ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతపురంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర ప్రమాణ స్వీకారంలో ఆయన పాల్గొన్నారు. ఆవోప అధ్యక్షుడు, న్యాయవాది డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సేవా రంగంలో ఎప్పుడు ముందుండి నడిపించే డాక్టర్ కొత్త రామకృష్ణకి ఈ పదవి రావడం శుభ పరిణామమన్నారు. ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు రామకృష్ణను అభినందించారు.

భక్తిశ్రద్ధలతో నీలేశ్వరపాలెం తిరునాళ్ల


నందీశ్వరునికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భారీగా తరలి వచ్చిన భక్తులు


స్వామివారికి అభిషేకాలు

అచ్చంపేట: మండలంలోని నీలేశ్వరపాలెంలో స్వయంభుగా వెలసిన గిరిజా సమేత నీలకంఠేశ్వరస్వామి తిరునాళ్ల మహోత్సవం సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 18వ శతాబ్ద కాలం నుంచి కార్తిక మాసంలో వచ్చే చివరి సోమవారం తిరునాళ్లు నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. ఆలయ పూజారాలు వేకువ జాము నుంచే అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయం ముందున్న నందీశ్వరుడు, ధ్వజ స్తంభం వద్ద దీపాలు వెలిగించారు. పొంగళ్లు పొంగించి, స్వామివారికి మొక్కుబడులు సమర్పించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని జ్యోతిర్లింగాలకు, కొండ దిగువన ఉన్న ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సమారాధన సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. మహిళలు భజన కార్యక్రమాలు చేపట్టారు. అయ్యప్ప మాలధారులు, గురుస్వాములు, శివభక్తులు ప్రదర్శనలు నిర్వహించారు. వీరశైవల శరభ– దళ్ళరభల ప్రదర్శనలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీఐ వెంకట ప్రసాద్ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. అచ్చంపేట నుంచి ఆటోలు, ట్రాక్టర్లలో భక్తులు తరలి వచ్చారు. కార్తీక చివరి సోమవారం స్థానిక హరిహర క్షేత్రంలోని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు చేశారు. భజన కార్యక్రమాలు చేపట్టారు. వేకువ జాము నుంచే భక్తులు ఆలయానికి తరలి వచ్చి, ధ్వజ స్తంభం వద్ద ప్రమిదలలో దీపాలు వెలిగించి, తమ భక్తిని చాటుకున్నారు.

జీవన ఎరువులతో భూమి సారవంతం


జీవన ఎరువు తయారీపై అవగాహన

మాదల(ముప్పాళ్ళ): రైతులు జీవన ఎరువుల వాడకాన్ని పెంచాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. మండలంలోని మాదల గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా సోమవారం జీవన ఎరువుల వాడకం, తయారీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రసాయన ఎరువుల వాడకం వల్ల భూ సారం దెబ్బతింటుందని, పశువుల ఎరువులో ట్రైకోడెర్మా విరిడి కలిపి జీవన ఎరువులు వాడటం వెల్ల నేల నుంచి సంక్రమించే తెగుళ్లను నిరోధించవచ్చన్నారు. నేల భౌతిక లక్షణాలను మెరుగు పరిచి భూమిలో హార్మోన్లు, ఖనిజ లవణాలు అందుబాటులో ఉంచి మొక్క పెరుగుదలకు కృషి చేస్తాయన్నారు. రైతులకు ట్రైకోడెర్మావిరిడీ కలిపే విధానంపై అవగాహన కల్పించారు. వ్యవసాయ కళాశాల విద్యార్థినులు జి.చైత్రిక, టి.లక్ష్మీశ్వేత, జి.భువనేశ్వరి, కె.దివ్య, కె.అఖిల, ఎస్కే ఆయిషా, ఆర్యహరి పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి


మాట్లాడుతున్న రవికుమార్

అచ్చంపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఘటించాలని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు గంజిమాల రవికుమార్ పిలుపునిచ్చారు. సోమవారు అచ్చంపేటలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. విశాఖ ప్రవీటీకరణను నిలిపివేయాలన్నారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులైజ్ చేయాలన్నారు. వ్యవసాయానికి స్మార్ట్ మీటర్లు పెడితే రైతుల ఇబ్బందులు పడాతారని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చడం విచారకరమన్నారు. వ్యవసాయంపై ధరల నియంత్రీకరణ, ఆహారం, మందులు, వ్యవసాయ ఉపకరణాలపై జీఎస్టీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్ వంట గ్యాసుపై ఎక్సైజ్ సుంకాన్ని ఎత్తివేయాలన్నారు. కరపత్రాలు పంపిణీ చేశారు. సీపీఎం నాయకులు హనుమంతరావు, చిలకా యేషయ్య, జి.మహేష్, కేకేరెడ్డి, ఎస్కే ముస్తఫా, ఎస్ ఆదినారాయణ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం అందించడంలో ఇక్కట్లు


వినతి పత్రం అందజేస్తున్న ఎంఈఓ అల్లి సురేష్, హెచ్ఎంలు విజయకుమారి, మంజరి, ప్రశాంతి

మాచర్ల రూరల్: నాటి రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం, రేషన్ డీలర్ల అవినీతితో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించటంలో పాఠశాలల హెచ్ఎంలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వివరాలల్లోకి వెళితే మండలంలోని కంభంపాడు గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీ, ఎంపీపీఎస్‌సీ పాఠశాలలకు మధ్యాహ్న భోజనం నిమిత్తం రేషన్ బియ్యం పంపిణీ చేయాల్సిన అధికారులు సక్రమంగా పంపిణీ చేయక పోవటంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు విద్యార్థులకు భోజనం అందించటంలో ఇబ్బందులకు గురవుతున్నారు. 2020 సంవత్సరంలో ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన ద్వారా పాఠశాలలకు బియ్యం పంపిణీ చేయాల్సి ఉండగా రెవెన్యూ అధికారులు రికార్డుల్లో రేషన్ డీలర్లకు అందించినట్లు, అవి వారు పాఠశాలలకు పంపిణీ చేసినట్లు నమోదు చేసుకున్నారు. దీనిపై అప్పటి నుంచి ఆయా పాఠశాలల హెచ్ఎంలు మండల విద్యాశాఖాధికారుల ద్వారా తహసీల్దార్‌కు, సివిల్ సప్లయిస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు ఆ పొరపాటును సరిచేస్తామంటూ దగ్గరలో ఉన్న రేషన్ డీలర్ల దగ్గర నుంచి బియ్యం సర్దుబాటు చేస్తూ వస్తున్నారు. మారిన ప్రభుత్వ పాలన నేపథ్యంలో కొత్తగా వచ్చిన డీలర్లు మేం పంపిణీ చేయమంటూ చేతులెత్తేయటంతో అక్టోబర్, నవంబర్ నెలలకు పాఠశాలలకు బియ్యం పంపిణీ చేయలేదు. ప్రతి రోజూ మధ్యాహ్న భోజనం వండేందుకు బియ్యం లేక హెచ్ఎంలు మధ్యాహ్న భోజన నిర్వాహకులకు బియ్యం అందించటంలో ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలల నుంచి పాఠశాలలకు బియ్యం అందకపోవటంతో విద్యార్థులు అర్థాకలితో అలమటించే పరిస్థితి వస్తుందనే ఆందోళనతో హెచ్ఎంలు రామిరెడ్డి విజయకుమారి, ఎం.రత్నమంజరి, ఎస్.మేరి ప్రశాంతి, ఎంఈఓ అల్లి సురేష్‌ని కలిసి తమ ఇబ్బందులను తెలిపారు. దీనిపై స్పందించిన ఎంఈఓ సురేష్ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ బత్తుల వాణిని కలిసి విద్యార్థులకు భోజనం అందించటంలో ఉపాధ్యాయులు పడుతున్న ఇబ్బందులను ఆమె దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాలని కోరారు. అలాగే ఈ విషయంపై జిల్లా విద్యాశాఖాధికారి దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చేయనున్నట్లు చెప్పారు.

మొదలైన క్రిస్మస్ సందడి


కేసానుపల్లి లూథరన్ చర్చిపై క్రిస్మస్ స్టార్


ప్రసంగిస్తున్న పాస్టర్ ప్రసన్నకుమార్



దాచేపల్లి : ప్రభువైన ఏసుక్రీస్తు జన్మదినోత్సవ వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. క్రీస్తు పుట్టిక దినమైన క్రిస్మస్ పండుగకు నెల రోజుల ముందు నుంచే క్రిస్మస్ సంబరాలు జరుపుకుంటారు. క్రిస్మస్ దినాలు ప్రారంభం సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు పుట్టుక గురించి పాస్టర్ జి.ఎస్.ప్రసన్నకుమార్ ప్రసంగించారు. క్రీస్తుని ఆరాధించటమే నిజమైన క్రిస్మస్ అని ఆయన చెప్పారు. క్రిస్మస్ పండుగ వేడుకల ప్రారంభం సందర్భంగా పలు చర్చిలపై క్రిస్మస్ స్టార్లు ఏర్పాటు చేశారు. ఆయా చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు.